
నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 7 నవంబర్ 2024 | VIKARABAD

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం రాత్రి వారు కేసీఆర్‌తో పరిగి, వికారాబాద్‌లతోపాటు రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు.

- పరిగి, నవంబర్ 6

## నల్లగొండ నుంచి కాదు.. హైదరాబాద్‌లో పాదయాత్ర చేయాలి

■ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



చెక్కులు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 6 : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని, అలా కాకుండా పేద ప్రజల ఇండ్ల మీదకు బుల్డోజర్లు పంపించి కూల్చివేయడం చాలా దారుణమని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేయబోయే పాదయాత్ర నల్లగొండ నుంచి కాకుండా హైదరాబాద్‌లోని మూసీ పక్క నుంచి చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై 54 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మూసీ పరిసర ప్రాంతాల్లో సీఎం పాదయాత్ర చేస్తే బాధితుల కష్టాలు తెలుస్తాయని, కూల్చివేతలు ఇక్కడ జరిపి.. పాదయాత్ర అక్కడ చేయడం ఏమిటని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం ఇచ్చి.. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. ఆడబిడ్డకు ఆసరా ఉంటుందనే ఉద్దేశంతోనే అప్పటి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకొచ్చారన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 11నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు.

రంగారెడ్డి జిల్లాలో లేఅవుట్లలో ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో లేఅవుట్లలో మిగిలిపోయిన ప్లాట్లు, ఖాళీ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించడానికి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేస్తూ బృందాలను ఏర్పాటు చేసింది. కాని, ఈ బృందంలో అతి ముఖ్యమైన పాత్ర పోషించే టౌన్ ప్లానింగ్ అధికారుల కొరత తీవ్రంగా ఉన్నది. జిల్లాలో 13 మున్సిపాలిటీలకుగాను ఐదుగురు మాత్రమే ఉండటంతో పనులు ముందుకు సాగడంలేదు. మరోవైపు ఇరిగేషన్ అధికారులు హైడ్రా ఆదేశాలతో చెరువులు, కుంటల ఆక్రమణలను గుర్తించే పనిలో పడ్డారు. దీంతో విధించిన మూడు నెలల గడువు పూర్తయినప్పటికీ వచ్చిన దరఖాస్తుల్లో ఐదు శాతం కూడా పూర్తికాకపోవడంపై దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

- రంగారెడ్డి, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ)





# ఎల్ఆర్ఎస్.. ఎప్పటికయ్యేను?

జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు, 549 గ్రామపంచాయతీలకుగాను 2,83,680 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో 2,37,250 దరఖాస్తులు రాగా.. 549 గ్రామపంచాయతీల్లో 46,430 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను క్రమబద్ధీకరించేందుకు టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిపి మున్సిపాలిటీల కోసం 48 బృందాలు, గ్రామపంచాయతీల కోసం 18 బృందాలను నియమించారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది. ఈ విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, గ్రామపంచాయతీలకు సంబంధించిన అధికారుల లాగిన్‌లో ఆమోదం తెలపాల్సిన అవసరం ఉంటుంది. చివరగా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాట్లకు సంబంధించి విస్తీర్ణాన్ని బట్టి ఫీజును నిర్ధారిస్తారు. కాని, అధికారుల్లో సమన్వయం లేకపోవడంతో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి.

### వాపోతున్న దరఖాస్తుదారులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ విషయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపానికి తోడు క్షేత్రస్థాయిలో అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఆరునెలలు దాటినప్పటికీ ఈ ప్రక్రియ ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి నిర్మాణాల అనుమతులు, బ్యాంకు లోన్లకు వెళ్లాలనుకునేవారికి తీవ్ర నిరాశ కలిగిస్తున్నది. జిల్లాలోని అతి పెద్ద మున్సిపాలిటీల్లో కూడా ఇదే తంతు కొనసాగుతున్నది. నగర శివారుల్లోని తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల, తుక్కుగూడ వంటి మున్సిపాలిటీల్లో వేలకొద్దీ దరఖాస్తులు వచ్చినప్పటికీ వందల్లో కూడా పరిష్కారం కాలేదు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో 43వేల దరఖాస్తులు రాగా.. 2300., ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 18వేల దరఖాస్తులకు 1600 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. దీంతో క్రమబద్ధీకరణ ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడంలేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ముఖ్యంగా గతంలో గ్రామపంచాయతీ అనుమతులతో చేపట్టిన లేఅవుట్లలో అనేకమంది ప్లాట్లు కొనుగోలు చేసినప్పటికీ ఎల్ఆర్ఎస్ లేకపోవడంతో ఈ అవకాశం కలిసివస్తుందని భావించారు. కాని వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది.

- ■ శాఖల మధ్య సమన్వయ లోపంతో ముందుకు సాగని ప్రక్రియ..
- ■ జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 2,83,680...
- ■ పరిష్కారం లభించినవి 7000 మాత్రమే..
- ■ వేధిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారుల కొరత...ఇరిగేషన్‌కు హైడ్రా అదనపు పనులు..
- ■ పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు..

### రియల్ ఎస్టేట్ పతనానికి ఇది కూడా ఓ కారణం..

జిల్లాలో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ప్లాట్లు, భూముల విక్రయాలు జరుగక ఈ రంగాన్ని నమ్ముకున్న అనేకమంది రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిలో ఖాళీ ప్లాట్లను కొనుగోలు చేసి ఎల్ఆర్ఎస్‌లు కట్టి విక్రయించుకుందామనుకున్నప్పటికీ ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ముందుకు సాగకపోవటంతో మరింత కుదేలైంది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ చకచకా సాగితే ప్లాట్ల క్రయవిక్రయాలు కూడా పెరిగే అవకాశాలున్నాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

### ఎల్ ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి



ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఇప్పటికే పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేసేందుకు కూడా ముందుకు రావడంలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసేందుకు కృషిచేయాలి.

– మైలారం విజయ్‌కుమార్



# అరకొరగా పరిహారం..

నష్టం వేల ఎకరాల్లో..ఇచ్చింది వందల ఎకరాలకే...

సెప్టెంబర్ మొదటి వారంలో తెరిపి లేని వర్షాలతో పెద్ద ఎత్తున పంట నష్టం

వికారాబాద్ జిల్లాలో కేవలం 1508 ఎకరాలకు మాత్రమే పంట నష్ట పరిహారం మంజూరు

రైతుల జాబితాపై గోప్యత

వికారాబాద్ జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ నెల మొదటి వారంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసి పంటలు, కూరగాయలకు తీవ్ర నష్టం వాటిల్లగా.. ప్రభుత్వం అరకొరగా పరిహారం అందించడంతోపాటు పరిహారం అందుకున్న రైతుల జాబితాను వ్యవసాయాధికారులు గోప్యంగా ఉంచడం పలు విమర్శలకు తావిస్తున్నది. సెప్టెంబర్ నెల ప్రారంభంలో వరుసగా నాలుగైదు రోజులపాటు కురిసిన వర్షానికి అన్ని ప్రాంతాల్లో పంటలకు, కూరగాయలకు నష్టం చేకూరింది. దీంతో పంటలు నష్టపోయినవారికి పరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి నష్టం అంచనా వేయాల్సిందిగా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. ఇందులోభాగంగా అధికారులు పంట నష్టానికి సంబంధించిన అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం పరిహారం డబ్బులు విడుదల చేసిన తర్వాత చూస్తే తక్కువ విస్తీర్ణం పంటలకే పరిహారం మంజూరైంది. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 1385 మంది రైతులకు 1508.32 ఎకరాలకు రూ.1,50,88,000 పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. భారీ వర్షాల వల్ల వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగితే కేవలం 1508 ఎకరాలకే పరిహారం అందించడం ఏమిటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. పంట నష్టం అంచనాల తయారు సమయంలోనే ఎంత మేరకు తగ్గితే అంత కుదించాలనే మౌఖిక ఆదేశాల వల్లే ఇంత తక్కువ విస్తీర్ణంలో పంట నష్ట పరిహారం వచ్చిందనే విమర్శలున్నాయి.

- పరిగి, నవంబర్ 6

### నష్టపరిహారం మండలాలవారీగా..

| మండలం | రైతులు | ఎకరాలు | (రూ.) |
|---|---|---|---|
| పెద్దేముల్ | 1 | 3 | 30000 |
| బంట్వారం | 11 | 13.25 | 136250 |
| బషీరాబాద్ | 40 | 41.12 | 413000 |
| బొంరాస్‌పేట్ | 10 | 15.17 | 154250 |
| ధారూరు | 115 | 147.30 | 1470750 |
| దౌల్తాబాద్ | 175 | 297.35 | 2978750 |
| కొడంగల్ | 267 | 284.17 | 2844250 |
| కోట్‌పల్లి | 5 | 7.17 | 74250 |
| మర్పల్లి | 28 | 22.20 | 225000 |
| మోమిన్‌పేట్ | 21 | 18.34 | 188500 |
| నవాబుపేట్ | 53 | 48.80 | 482000 |
| పరిగి | 203 | 186.12 | 1863000 |
| పూడూరు | 53 | 69.36 | 699000 |
| తాండూరు | 26 | 26.34 | 268500 |
| వికారాబాద్ | 363 | 316.10 | 3162500 |
| యాలాల | 14 | 9.32 | 98000 |

### విడుదలకాని రైతుల జాబితా..

సెప్టెంబర్ నెల ప్రారంభంలో నాలుగైదు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహించడంతోపాటు పొలాల్లో నీరు నిలిచి, రోజుల తరబడి ఎండ లేకుండా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా జిల్లావ్యాప్తంగా కేవలం 1508 ఎకరాలకే పరిహారం అందడం ఏమిటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున నష్ట పరిహారం అందించింది. 33 శాతానికి పైగా నష్టపోయిన పంటలకే పరిహారం అందిందని వ్యవసాయాధికారులు పేర్కొంటుండగా.. పరిహారం అందిన రైతుల జాబితా విషయంలో ఎందుకు గోప్యత పాటిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవంగా పంట నష్టం అంచనా వేస్తే గోప్యత ఏమి అవసరమని ప్రశ్నిస్తున్నారు. ఒకసారి జిల్లావ్యాప్తంగా పరిహారం అందిన వివరాలు పరిశీలిస్తే వర్షాలు కురిసి అన్ని గ్రామాల్లో నష్టం జరగగా.. పెద్దేముల్ మండలంలో ఒక్క రైతుకే పరిహారం రావడం ఏమిటని పేర్కొంటున్నారు. పలు మండలాల్లో ఒక క్లస్టర్ పరిధిలోని ఒకటి రెండు గ్రామాల రైతులకే పరిహారం వచ్చింది. వాగుల పక్కన, పల్లపు భూముల్లో నీరు నిలిచిన చోటనే నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు పేర్కొంటుండగా.. అసలు ఏ రైతు పంటకు నష్టం జరిగింది, ఎవరికి పరిహారం అందిందనే విషయంలో వ్యవసాయాధికారులు జాబితా విడుదల చేయకుండా గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిస్తున్నదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. వాస్తవంగా నష్టం జరిగిన రైతుల పేర్లే రాస్తే గోప్యత అవసరం లేదని అంటున్నారు.



### పంటలు నష్టపోయినా పరిహారం రాలేదు



గత నెల మొదటి వారంలో వరుసగా భారీ వర్షాలు కురిసి వివిధ పంటలకు, కూరగాయలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాల్సి ఉండగా వ్యవసాయాధికారులు సరైన అంచనాలు తయారు చేయకపోవడం వల్ల వాస్తవంగా పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం అందలేదు. పరిగి మండలం నస్కల్ క్లస్టర్‌లో వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లగా మా గ్రామానికి చెందిన రైతులకు నష్టపరిహారం అందలేదు.

– మేడిద రాజేందర్, నస్కల్, పరిగి మండలం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

## అపోహలు పెట్టుకోవద్దు

○ అన్ని వర్గాలకు రాజకీయ, సామాజిక అవకాశాల మెరుగుకే సర్వే

○ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

చేవెళ్ల రూరల్, నవంబర్ 6 : ఇంటింటి సర్వే ద్వారా రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు రద్దు చేస్తామని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, అన్ని వ ర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు సర్వే చేస్తున్నామని స్పష్టం చేశారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని భవానీనగర్ (9వ వార్డు)లో ఉన్న పోచమ్మ గుడి వద్ద సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సర్వే ద్వారా సేకరించిన సమాచారంతో ప్రజలకు కులాల వారీగా, సామాజిక పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకొని వాటిని అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

### 5,344 మంది ఎన్యూమరేటర్లు

రంగారెడ్డి జిల్లాలో 5,344 మంది ఎన్యూమరేటర్లను నియమించామని మంత్రి శ్రీధర్‌బా బు తెలిపారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇండ్లను కేటాయించామన్నారు. ఈ నెల 30 వరకు కొనసాగనున్న సర్వేలో మొదటి మూ డు రోజులు ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికిస్తారని వెల్లడించారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిలో 40 నిమిషాల పాటు కూర్చొని ప్రభుత్వం సూచించిన 75 అంశాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. ఏమైనా తప్పులు ఉంటే తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, సీపీవో సౌమ్య, డీపీవో సురేశ్ మోహన్, ఎంపీడీవో వెంకయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.